భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ధర్మసాగర్ : మండల కేంద్రంలో సిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

కాజీపేట, ఏప్రిల్ 29 : బాపూజీ నగర్‌లోని గేథ్‌మెన్స్ మందిరం, డీజిల్ కాలనీ వెలంకణి చర్చి, సోమిడిలోని బాలయేసు మందిరం, ఇన్‌ఫాంట్ జీసెస్ చర్చి, వెంకటాద్రి నగర్‌లోని కార్మెల్ చర్చి, రహిమత్‌నగర్‌లోని సీఎస్ఐ, బీఎల్ఎం చర్చి, తెలుగు బాప్టిస్ట్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

కరుణాపురంలో..

ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురం ఆర్‌సీఎం చర్చిలో యువకులు నాడు యేసుక్రీస్తును సిలువకు వేసే దృశ్యాలను ప్రదర్శించారు. 14 స్థలాల్లో యేసు పడిన శ్రమలను పాటల ద్వారా వినిపించారు. కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరంలో గుడ్ ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఎలుకుర్తి, రాపాకపల్లె, నారాయణగిరి, మల్లక్‌పల్లె, పెద్ద పెండ్యాల, తాటికాయల గ్రామాల్లో నిర్వహించారు.

ఊరుగొండలో..

దామెర : మండలంలోని ఊరుగొండ పునీత తేరేజమ్మ క్యాథలిక్ చర్చిలో వేడుకలు జరిగాయి. ఏసుక్రీస్తు, భటుల వేషధారణ ధరించి సిలువతో జరిగిన ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దామెరలోని తెలుగు బాప్టిస్టు, ల్యాదెళ్ల, కోగిల్వాయి, పులుకుర్తి చర్చిల్లో ప్రాత్యేక ప్రార్థనలు జరిగాయి.

తిమ్మరాయనిపహాడ్‌లో..

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయనిపహాడ్‌లో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దల సమక్షంలో క్రైస్తవులు వీధుల్లో సిలువలను మోస్తూ ప్రదర్శించారు. పునీత రాయప్ప చర్చి ఫాదర్ తుమ్మ యాగారెడ్డి ప్రసంగించారు. కొండవీటి ప్రదీప్, బాలజోజి, జయరాజ్ పాల్గొన్నారు.

కొండా మురళీని కలిసిన ఈద్గా కమిటీ సభ్యులు

కొండా మురళీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న జబ్బార్

కరీమాబాద్, మార్చి 29: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును ఖిలావరంగల్ ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఖిలావరంగల్ ఈద్గా, ఖబరస్థాన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన్ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, షకీల్ అహ్మద్, మగ్దూమ్, హసన్‌అలీబేగ్, మాషుఖ్, అమ్జద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నాయకుల చేరిక

ఐనవోలు, మార్చి 29: బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఐనవోలు, వర్ధన్నపేట మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సుమారు 600 మంది డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దూరంగా ఉండడం పార్టీలో చర్చనీయాశంగా మారింది. ఎంపీపీ మార్నేని మధుమతి, నాయకులు చందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, సంపత్‌కుమార్, సాంబయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి, మార్చి 29: చింతగట్టు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కోమటిపల్లి, అహల్యాతండా, దేవన్నపేట, సుబ్బయ్యపల్లితోపాటు తండాల్లోని వ్యవసాయ బావులకు కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

నేడు హనుమకొండలో తాగునీటి సరఫరా బంద్

వరంగల్, మార్చి 29 : నగరంలోని నయీంనగర్ నాలా వద్ద ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా ఈఈ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ ఫిల్టర్ బెడ్ పరిధిలోని పబ్లిక్ గార్డెన్, గుడిబండల్, కొత్తూర్ జెండా, మచిలీబజార్, పద్మాక్షి కాలనీ, యాదవనగర్, చింతగట్టు, ముచ్చర్ల, విద్యారణ్యపురి, హసన్‌పర్తి, భీమారం, పలివేల్పుల, వంగపహాడ్, గుండ్ల సింగారం, పైడిపల్లి, గోపాలపురం, కేయూసీ జంక్షన్, ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నత్తనడకన చలివాగు మరమ్మతులు

- కట్టపై నాసిరకం మొరంతో పనులు
- మత్తడి మట్టి తీసి కట్టపై పోస్తున్న కాంట్రాక్టర్
- వానాకాలంలోపు పనులు పూర్తికాకుంటే రైతులకు కష్టమే

శిథిలమైన చలివాగు తూము

మత్తడి సమీపంలోని మట్టిని తవ్వడంతో ఏర్పడిన గుంతలు

శాయంపేట, మార్చి 29 : మండలంలోని జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు పనులు నత్తే నయం అన్నట్లుగా మారాయి. రూ.10.30 కోట్లతో చలివాగును ఆధునీకరించే పనుల్లో వేగం లేకపోవడంతో కాంట్రాక్టర్‌కు ఇరిగేషన్ అధికారులు రెండు నోటీసులు జారీ చేశారు. అయినా పనుల్లో పురోగతి కనిపించకపోవడంతో మూడో నోటీసు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అరవై ఏండ్ల క్రితం నిర్మించిన చలివాగు జలాశయం జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల పరిధిలో సాగు, తాగునీటికి ప్రధాన వనరుగా మారింది. కాల్వలు దెబ్బతిని, తూము, ప్రాజెక్టు శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.10.30 కోట్లను మంజూరు చేసింది. పనులు సజావుగా జరిగేందుకు యాసంగికి క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో వందలాది ఎకరాల్లో నాట్లు వేయలేదు. అయితే, కాంట్రాక్టర్ అగ్రిమెంట్ పూర్తి చేసుకున్నా పనులను ప్రారంభించలేదు. పలుమార్లు 'నమస్తే తెలంగాణ' కథనాలతో ఎట్టకేలకు పనులను ప్రారంభించారు. అయితే, నెల రోజులు గడిచినా పనులు వేగంగా జరుగకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. 14 కిలోమీటర్లున్న కాల్వల్లో దాదాపు 4 కిలోమీటర్లు లైనింగ్ నిర్మించాల్సి ఉన్నది. ప్రాజెక్టు తూము పూర్తిగా శిథిలమైంది. కొత్తగా పనులు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు కట్టను బలోపేతం చేయాలి. చలివాగులో డీసిల్టింగ్ పనులు చేయాలి. ఏడాది అగ్రిమెంట్‌తో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటికే ఆరు నెలలు దాటిపోయినా పనులు నామమాత్రంగా జరగడంతో వానాకాలంలోపు ఎలా పూర్తి చేస్తారని రైతులు వాపోతున్నారు. ఒకటి, రెండు మిషన్లతో కట్టపై పనులు చేపట్టారు. జంగిల్ తొలగించి 1.6 కిలోమీటర్ల దూరం కట్టపై మొరం నింపుతూ బలోపేతం చేయాల్సి ఉన్నది. అయితే ప్రాజెక్టు మత్తడి సమీపంలోని నాసిరకం మొరాన్ని కట్టపై పోసి చదును చేస్తున్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ సైతం మరొక కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి ఇద్దరు కలిసి పూర్తిచేయాలని సూచించారు. అయినా ఎలాంటి పురోగతి లేదు. కోట్లాది రూపాయలు పెట్టినా మళ్లీ పాత పరిస్థితే ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నట్లు రైతులు దిగులు చెందుతున్నారు.

కట్టపై నాసిరకం మొరం పోసింది వాస్తవమే

ప్రాజెక్టు మత్తడి సమీపంలోని నాసిరకం మట్టిని కట్టపై పోసింది వాస్తవమే. అయితే కట్టపై 400 మీటర్లకు పైగా పని జరిగింది. మొరం మట్టి నాసిరకంగా ఉండడంతో గమనించి బండ్ చేయించాం. చుట్టున్న చెరువుల్లోని నాణ్యమైన మొరాన్ని సీనరేజ్ చెల్లించి తెచ్చి పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం. మత్తడి వద్ద బొందలు తేలడంతో ప్రాజెక్టు డీసిల్టింగ్ మట్టిని పోసి నింపుతాం. చలివాగు మరమ్మతుల్లో వేగం లేకపోవడంతో రెండు రోజుల క్రితమే రెండో నోటీసు జారీ చేశాం. మూడో నోటీసు ఇచ్చి చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నాం.

– ఇరిగేషన్ ఏఈ అమృత్

గ్రామాల్లో జోరుగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు

కమలాపూర్, మార్చి 29 : మండలంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా కొనసాగుతున్నాయి. ఆయా జట్ల గెలుపు, ఓటములపై యువకులు రూ.లక్షల్లో బెట్టింగ్ పెడుతున్నారు. కమలాపూర్, ఉప్పల్, భీంపల్లి, శనిగరం, మర్రిపల్లిగూడెం, గూడూరు, అంబాల తదితర గ్రామాల్లోని యువకులు రాత్రి 12గంటల వరకు సెల్‌ఫోన్‌లోనే బెట్టింగ్‌లు చేస్తున్నారు. కొందరు యువకులు బ్రోకర్లుగా మారి క్రికెట్ బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు చెల్లింపులు చేస్తున్నారు. ఇలా రోజూ లక్షల రూపాయల బెట్టింగ్ చేస్తూ కొందరు యువకులు డబ్బులు పోగొట్టుకుంటున్నట్లు తెలిసింది. క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసులు దృష్టిసారించి, బ్రోకర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వర్ధన్నపేట, మార్చి 29 : ఆకేరువాగు బ్రిడ్జిపై బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం జరిగింది. ఇల్లెంద గ్రామానికి చెందిన గడ్డల వెంకటస్వామి వర్ధన్నపేటలో వ్యక్తిగత పనికోసం వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో తన బైక్ అదుపుతప్పి ఆకేరువాగు బ్రిడ్జిపై పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలు కాగా అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే ఇతర వాహనదారులు 108, పోలీసులకు సమాచారం ఇచ్చి దవాఖానకు తరలించారు.

పలువురిపై గృహహింస కేసు

చెన్నారావుపేట, మార్చి 29 : పలువురిపై పోలీసులు శుక్రవారం గృహ హింస కేసు నమోదు చేశారు. ఎస్సై గూడ అరుణ్ కథనం ప్రకారం.. మండలంలోని గొల్లభామతండా పంచాయతీ పరిధిలోని అడ్డబాట తండాకు చెందిన భూక్యా రాజేందర్‌కు సునీతకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సునీతను భర్త రాజేందర్, అతడి తల్లి, అక్క, తమ్ముడు పలు కారణాలతో రోజూ హింసిస్తున్నట్లు తెలిపారు. సునీత ఫిర్యాదు మేరకు భర్త రాజేందర్, అత్త వీరమ్మ, మరిది నవీన్, ఆడబిడ్డతోపాటు మరో ఇద్దరిపై గృహహింస కేసు నమోదు చేసినట్లు వివరించారు.

'క్రషర్లు మూసివేయాలి'

శాయంపేట, మార్చి 29 : మండలంలోని మాందారిపేట శివారులోని ఈఆర్ఆర్, మరో క్రషర్‌ను మూసివేయాలని గోవిందపూర్ గ్రామ రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. క్రషర్‌కి వెళ్లే దారిలో గడ్డితో మంట పెట్టారు. రోడ్డుకు అడ్డంగా నిలబడి క్రషర్లు మూసేయాలని నినాదాలు చేశారు. క్రషర్ల నుంచి వస్తున్న దుమ్ము పడి పంటలు దెబ్బతిని నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. అలాగే తమ భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. న్యాయం చేయాలని కోరారు.



సంగెం : రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న మామునూరు ఏసీపీ తిరుపతి

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఏసీపీ

సంగెం, మార్చి 29 : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని మామునూరు ఏసీపీ తిరుపతి హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు శుక్రవారం పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ చేశారు. ఎలాంటి గొడవలకు వెళ్లకుండా పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకోవాలన్నారు. సత్ప్రవర్తన కలిగిన వారి రౌడీషీట్ తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సీఐ ఇస్లావత్ శ్రీనివాస్, ఎస్సై లావుడ్యా నరేశ్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి..

ఆత్మకూరు : మండలంలోని రౌడీషీటర్లకు సీఐ క్రాంతికుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎలాంటి నేరాలకు పాల్పడొద్దని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

బీఆర్ఎస్ వేలేరు మండల నాయకులు

మాట్లాడుతున్న మరిజె నర్సింహారావు

వేలేరు, మార్చి 29 : ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన పదవికి రాజీనామా చేసి వేరే పార్టీలో చేరాలని వేలేరు మండల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వేలేరులో ఎంపీటీసీ ఇట్టబోయిన సంధ్య నివాసంలో మండలాధ్యక్షుడు మారిజె నర్సింహారావు, జడ్పీటీసీ చాడ సరితారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కడియం శ్రీహరికి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆయన కూతురు కావ్యకి వరంగల్ లోక్‌సభ టికెట్‌ను కేటాయించారని పేర్కొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజయ్యను కాదని, కడియంకు టికెట్ ఇచ్చి గెలిపిస్తే ఇప్పుడు పార్టీకి ద్రోహం చేసి తన స్వార్థ ప్రయోజనాల కోసం వేరే పార్టీలో చేరడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, ఎంపీటీసీ బత్తుల జ్యోతి, కో ఆప్షన్ మెంబర్ జానీ, నాయకులు మహేందర్, భూపతిరాజ్, ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, స్వరూప పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల బృందాల తనిఖీలు

- భారీగా మద్యం, నగదు స్వాధీనం
- 22 లైసెన్స్ ఆయుధాల డిపాజిట్

ఖిలావరంగల్, మార్చి 29: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బృందాలు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీ చేపట్టాయి. చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లాలో గురువారం వరకు 22 మంది లైసెన్స్ ఆయుధాలను ఆయా పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేసినట్లు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పీ ప్రావీణ్య తెలిపారు. సీఆర్ పీసీ కింద 31 కేసులు, నేరాలు జరగకుండా ముందస్తుగా 82మంది బైండోవర్లు చేసినట్లు పేర్కొన్నారు. నాకాబందీ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంసీసీ ఆధ్వర్యంలో పబ్లిక్ ప్రాపర్టీపై 11,784 బ్యానర్లు, పోస్టర్లు, ప్రైవేట్ ప్రాపర్టీపై ఉన్న 10,128 ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను తొలగించినట్లు వివరించారు. ఈనెల 27న దుగ్గొండి మండలం గిర్నిబావి జంక్షన్‌లో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతోపాటు మరికొన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రభబండ్లు, డీజే వాహనాలతో ర్యాలీ నిర్వహించారని, హనుమకొండ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద దుగ్గొండి పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వరంగల్ జిల్లాలో రెండు రోజుల్లో రూ.15,04,885 విలువైన 3,602.82 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని, 96 కేసులు నమోదు చేసి, 84 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 28 బెల్టుషాపులను సీజ్ చేసినట్లు చెప్పారు. ఎఫ్ఎస్‌టీ ఆధ్వర్యంలో రూ.16,08,192 నగదును సీజ్ చేసి, 31కేసులు స్వీకరించి పరిశీలించినట్లు వివరించారు.

ప్రారంభమైన లింగగిరి వాటర్ ప్లాంట్

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

విద్యుత్ బకాయిలు చెల్లించి వాటర్‌ప్లాంట్‌ను పునరుద్ధరిస్తున్న అధికారులు, నాయకులు

చెన్నారావుపేట, మార్చి 29: విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లించకపోవడంతో మూతబడిన వాటర్ ప్లాంట్‌ను తిరిగి శుక్రవారం పునరుద్ధరించారు. మండలంలోని లింగగిరిలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ విద్యుత్‌బిల్లు బకాయిలు చెల్లించకపోవడంతో మూతపడింది. దీంతో వేసవిలో తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు వెంటనే స్పందించి రూ.14,500 విద్యుత్ బకాయిలను శుక్రవారం చెల్లించి వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించినట్లు గ్రామ కార్యదర్శి శ్యామ్‌కుమార్ తెలిపారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది పడకుండా వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించడంలో సహాయపడిన 'నమస్తే తెలంగాణ'కు, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బొగ్గు నిల్వలు పేరుకుపోతున్నాయి

- 300 టన్నుల బొగ్గును ఉప్పల్ రైల్వే స్టేషన్ వరకు రవాణా చేస్తాం
- సింగరేణి సీఎండీ ఎన్ బలరాంనాయక్

గూడ్స్ రైలుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న సింగరేణి సీఎండీ బలరాం నాయక్

భూపాలపల్లి రూరల్, మార్చి 29: బొగ్గు వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గూడ్స్ షెడ్డును ప్రారంభించినట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరాంనాయక్ అన్నారు. శుక్రవారం ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే మొదటి కోల్ రేక్, సౌత్ సెంట్రల్ రైల్వే సింగరేణి కోప్రాజెక్ట్ వారి అనుసంధానంతో ఉప్పల్ గూడ్స్ షెడ్డును భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ అధ్యక్షతన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా సీఎండీ బలరాంనాయక్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ టీ వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై కోల్ రేక్ గూడ్స్ రైలుకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ భూపాలపల్లి సింగరేణి ఏరియాలో ఉత్పత్తి అవుతున్న బొగ్గులో కొంత భాగం ఉప్పల్ రైల్వే స్టేషన్ నుంచి రైలు మార్గం ద్వారా వినియోగదారులకు రవాణా చేసేందుకు ఈ రైల్వే స్లయిడ్ అందుబాటులో ఉంటుందన్నారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా నుంచి రోజుకు సుమారు 300 టన్నుల బొగ్గును ఉప్పల్ రైల్వే స్టేషన్ వరకు రవాణా చేసి అక్కడి నుంచి వినియోగదారులకు రవాణా చేయడానికి దక్షిణమధ్య రైల్వే అధికారులతో సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ జే ఆల్విన్, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ సూర్యనారాయణ కొన్ని రోజుల ముందు ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో చర్చించి రవాణాకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. భూపాలపల్లి ఏరియాలో సుమారు 14 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందని, అందుబాటులోకి వచ్చిన బొగ్గును విద్యుత్ వినియోగదారులకు రైల్వే రేకుల ద్వారా పంపించడానికి యాజమాన్యం నిర్ణయించిందని తెలిపారు. అనంతరం ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ టీ వెంకటేశ్వర్‌రెడ్డి భూపాలపల్లి కేటీకే ఓసీ-3, కేటీకే ఓసీ-2 గనులను సందర్శించారు. ఈ సందర్భంగా 2024- 25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను, బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు అవసరమయ్యే యంత్రాలు, పని స్థలాలు, పరికరాలు, కావాల్సిన స్పేర్‌పార్ట్స్‌పై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జీఎం, ఓఎస్‌డీ హబీబ్ హుస్సేన్, చైర్మన్ కో ప్రాజెక్ట్ విజేందర్‌రెడ్డి, సీసీఎస్ఆర్ వెంకటరమణ, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఏరియా అధికారి మున్వర్ పాషా, ఉప్పల్ స్టేషన్ మాస్టర్ దిలీప్ కుమార్, ఏజీఎం జ్యోతి, డీవైపీఎం శ్యామ్ ప్రసాద్, ఇన్‌చార్జి అధికార ప్రతినిధి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గీసుగొండ, మార్చి 29 : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. రాత్రి 10 గంటలకు ఆలయ గర్భ గుడి నుంచి స్వామి ఉత్సవమూర్తులను అర్చకులు రథంపైకి చేర్చారు. గోవింద నామస్మరణ చేస్తూ భక్తులు రథాన్ని గుట్ట చుట్టూ లాగారు.

దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉంది

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తోటపల్లి విజయ్

వరంగల్, మార్చి 29 : ఇతర దేశాల కంటే భారతదేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని సీఏ తోటపల్లి విజయ్ అన్నారు. శుక్రవారం హంటర్ రోడ్డులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సీఏ భగవాన్‌దాస్ ముందాడ అధ్యక్షతన ఆడిట్‌పై జరిగిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ దృఢంగా ఉండడం వల్లే బ్యాంకింగ్ రంగం ఒడిదుడుకులు లేకుండా సాగుతున్నదన్నారు. వరంగల్ ఐసీఏఐ చైర్మన్ భగవాన్‌దాస్ మాట్లాడుతూ.. సీఏలు ఆడిటింగ్‌ను బాధ్యతగా నిర్వహిస్తున్నారన్నారు. సదస్సులో చార్టర్డ్ అకౌంటెంట్స్ మాదారపు సుజిత్, రాయబారపు హరికృష్ణ, తోట కరుణాకర్, చంచల్ అగర్వాల్, రాజేశ్ బజాజ్, వంశీకృష్ణ, పరమేశ్, భరత్, సాయి, బిందు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో అన్నదానం

భోజనం చేస్తున్న విద్యార్థులు

పోచమ్మమైదాన్, మార్చి 29: వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అన్నదానం చేశారు. యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాకు చెందిన మింగాల హృదయ మేరి వర్ధంతి సందర్భంగా కుమారుడు, కోడలు కానిస్టేబుల్ మింగాల బెల్సన్, సమత సహకారంతో విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్, కానిస్టేబుళ్లు కన్నె రాజు, బొట్టు కమలాకర్, కోలా రాజేశ్, ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, పృథ్వీ, రాజ్‌కుమార్, రాంప్రసాద్, సృజన, జ్యోతి, భావన, యాకయ్య పాల్గొన్నారు.

చీరెలను సీజ్ చేసిన అధికారులు

మహిళకు నోటీసును అందజేస్తున్న అధికారులు

ములుగు రూరల్, మార్చి 29 : ములుగు జిల్లా కేంద్రం పరిధిలోని గట్టమ్మ వద్ద గురువారం రాత్రి వాహనంలో తీసుకువస్తున్న చీరెలను ఎన్నికల అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఎగ్గడి సదయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గట్టమ్మ వద్ద వాహనాలను తనిఖీ చేపట్టామన్నారు. ఈ మేరకు హనుమకొండ వైపు నుంచి వస్తున్న మహేంద్ర జైలో వాహనంలో 10 బ్యాగుల్లో చీరెలు లభించాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం అమరవరం గ్రామానికి చెందిన మొగిలిపల్లి సువర్ణకుమారి రూ.1,17,700 విలువైన 582 చీరెలను తరలిస్తున్నట్లు గుర్తించామని, రూ.50వేల కంటే ఎక్కువ విలువైన నగదు లేదా వస్తువులను తరలించవద్దనే నిబంధనలున్నందున వాటిని సీజ్ చేసి కలెక్టరేట్‌లో భద్రపర్చినట్లు సదయ్య తెలిపారు.

డీజే బాక్స్ పడి బాలుడి మృతి

కురవి(సీరోలు), మార్చి 29 : సీరోలు మండలం బూర్గుచెట్టుతండా జీపీ పరిధిలోని పీక్లా తండాలో శుక్రవారం పెళ్లి వేడుకలో విషాదం జరిగింది. డీజే సౌండ్ బాక్సులు పడి బానోత్ మనోజ్(14) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. బానోత్ శ్రీను చిన్నకుమారుడు మనోజ్ తండాలో జరుగుతున్న పెళ్లికి వెళ్తున్నాడు. అదే సమయంలో మాలోత్ సాయి డీజే బాక్సులు తీసుకొని వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు డీజే బాక్సులు మనోజ్‌పై మీద పడి మృతి చెందాడు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీరోలు ఎస్సై విజయ రామ్‌కుమార్ తెలిపారు.

తోపులాటలో ఒకరు మృతి

నలుగురిపై కేసు నమోదు

గూడూరు, మార్చి 29 : ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో ఒకరు మృతిచెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామ పరిధి తేజావత్ ధంజ్యాతండాలో శుక్రవారం జరిగింది. ఎస్సై నగేశ్ కథనం ప్రకారం... ధంజ్యాతండాకు చెందిన తేజావత్ భద్రు(45) కుమారుడు లక్ష్మణ్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ నెల 3న లక్ష్మణ్ హైదరాబాద్‌లో మృతిచెందాడు. ఇదే తండాలో ఒకే కుటుంబానికి చెందిన నవీన్, అమ్మి, రేణుక, సునీత కూడా హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. వీరు ఇటీ